
సాక్షి
ఒడిశా

బుధవారం । 19 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4.26.562లు. బంగారం 1 గ్రాముల 100 మిల్లీగ్రాములు. వెండి 33 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హత్యపై పునఃదర్యాప్తు

మాజీ మంత్రి నవకిశోర్ దాస్ హత్యపై దర్యాప్తు మళ్లీ ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటించింది. - 8లో.



వేతనాలు పెంచాలి

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు ధర్నా చేశారు. డిమాండ్లు నెరవేర్చాలన్నారు. - 8లో.

న్యూస్‌రీల్

అటవీ ఉత్పత్తుల విక్రయానికి విజ్ఞప్తి



కలెక్టర్ కార్యాలయం వద్ద వినతి పత్రాలతో గిరిజనులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి ఉదులిబేఢ పంచాయతీ పేడాగూఢ గ్రామ అటవీ భూమి హక్కుల కమిటీ తరపున అటవీ ఉత్పత్తుల విక్రయాలకు అనుమతులు కోరుతూ మంగళవారం కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అటవీ భూమి హక్కుల కమిటీ అధ్యక్షుడు సమర నాయక్, కార్యదర్శి భక్తరామ్ పూజారి నేతృత్వంలో కమిటీ సభ్యులు కలెక్టర్‌తో చర్చించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద నీటిని అందిస్తున్న ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కుమార్‌గూడ గ్రామం వద్ద పోడియ పోలీసులు చలివేంద్రం సోమవారం ప్రారంభించారు. సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ ఎక్కువ మంది ప్రయాణిస్తూ ఉంటారు. అందువలన ప్రజాప్రయోజనార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ తెలిపారు.

ఆస్పత్రిలో పనిచేయని ఎక్స్‌రే మిషన్!



తాళాం వేసి ఉన్న ఎక్స్‌రే యూనిట్

జయపురం: జయపురం పూల్‌బెడ ప్రాంతంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ పనిచేయటంలేదు. దీంతో ఎక్స్‌రే యూనిట్ గదికి సిబ్బంది తాళాలు వేసేశారు. ఫలితంగా రోగులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఉచితంగానే ఎక్స్‌రే తీసేవారు. అయితే ప్రస్తుతం పని చేయక పోవటంతో రోగులు ప్రైవేటుగా డబ్బులు చెల్లించి ఎక్స్‌రేలు తీయించుకుంటున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న జయపురం పట్టణానికి వెళ్లి ఎక్స్‌రే తీయించుకోవాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎక్స్‌రే యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

జయపురం యువతికి నారీరత్న పురస్కారం



నారీ రత్న పురస్కారాన్ని అందుకున్న ప్రభాతి

జయపురం: జయపురం యువతి, ప్రస్తుతం ఢిల్లీలో న్యాయవాదిగా పనిచేస్తున్న ప్రభాతీ నాయక్ మిశ్రాకు నారీ రత్న పురస్కారం లభించింది. ప్రపంచ ఒడిశా సొసైటీ వారు న్యూఢిల్లీలో నిర్వహించిన శక్తి ఉత్సవంలో న్యాయవాది ప్రభాతీ నాయిక్‌ను ఘనంగా సత్కరించారు. ప్రభాతీ పాతికేళ్లుగా పాత్రికేయ రంగంలో ఉంటూ సాధారణ ప్రజల గొంతుగా వారి సమస్యలపై పోరాడారు. కొన్నేళ్లుగా న్యాయవాదిగానూ పనిచేస్తున్నారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన ప్రభాతి గృహిణిగా కుటుంబంపై తన బాధ్యతలను నిర్వహిస్తూ న్యాయవాదిగానూ రాణిస్తున్నారు. దీంతో ఆమెను ప్రపంచ ఒడియా సొసైటీ వారు నారీరత్న బిరుదుతో సన్మానించారు. ప్రభాతి జయపురం మున్సిపాలిటీ పరిధి జయనగర్ నివాసీ కైలాస చంద్ర నాయిక్ కుమార్తె. ఆమె మున్సిపాలిటీ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో, మహిళా కళాశాలలో, విక్రమదేవ్ కళాశాలలో చదివారు.

నాగేశ్వరి గుహలను ముట్టుకుంటే క్షమించం



ప్రసంగిస్తున్న రామచంద్ర ఖడం



నందపూర్ మెయిన్ రోడ్డులో సీఎల్పీ నాయకుడు రామ్ ఖడం, ప్రపుల్ల సామంత్రాయ్ ర్యాలీ

కొరాపుట్: గనుల తవ్వకాల పేరిట నాగేశ్వరి గుహలను ముట్టుకుంటే క్షమించబోమని గిరిజనులు హెచ్చరించారు. మంగళవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కేంద్రంలో వేలాది మంది గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. అభివృద్ధి పేరిట అదానీ కంపెనీకి ఈ గుహలు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ గుహలు ఉన్న బల్దా ప్రాంతంలో నాగేశ్వరి కొండలు ఆవరించి ఉన్న 5 పంచాయతీల ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. సీఎల్పీ నాయకుడు, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర ఖడం ఈ ర్యాలీకి నేతృత్వం వహించారు. భారీ ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవి బిడ్డల నుంచి భూమిని బలవంతంగా లాక్కునే ప్రక్రియకు తాము వ్యతిరేకమని తెలిపారు. గ్రామ సభ అనుమతి లేకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇదే సభలో ప్రముఖ హక్కుల ఉద్యమ నాయకుడు ప్రపుల్ల సామంత్రాయ్ ప్రసంగించారు. అదానీ కోసం రాజ్యాంగ హక్కులను కాల రాస్తూ గిరిజనులను అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ర్యాలీ సందర్భంగా పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు.



నందపూర్ మెయిన్ రోడ్డులో గిరిజనుల ర్యాలీ



నందపూర్ తహసీల్దార్ కార్యాలయం ముట్టడించిన గిరిజనులు

27న అసెంబ్లీ ఎదుట ధర్నా

• కాంగ్రెస్ నాయకుల వెల్లడి



విలేకర్ల సమావేశంలో బలభద్ర మఝి, ద్రౌపది తదితరులు

రాయగడ: రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా ఈ నెల 27వ తేదీన అసెంబ్లీ ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ బలభద్ర మాఝి పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 25 ఏళ్ల బీజేడీ పాలనలో మహిళలపై పెరిగిన అత్యాచారాలను అప్పటి పాలకులు అదుపుచేయలేకపోయారన్నారు. దీంతో ప్రజలు ఆ పార్టీకి బదులు బీజేపీని గెలిపించారన్నారు. అయితే బీజేపీ ఎనిమిది నెలల పాలనలో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాల సంఖ్య మరింత పెరగటం ఆ పార్టీ అసమర్థతకు నిలువటద్దంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన అసెంబ్లీ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో అంతా పాల్గొని బీజేపీ పాలనను ఎండగట్టాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాయగడ జిల్లా పర్యవేక్షకురాలు ద్రౌపదీ మాఝి, పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్‌పండా, డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్ పాల్గొన్నారు.

రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం



రాగిజావ తాగుతున్న మంత్రి నిత్యానంద గొండో

కొరాపుట్: రాగి జావతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మంత్రి నిత్యానంద గొండో తెలిపారు. మంగళవారం తన సొంత నియోజకవర్గం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణం 12వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి పర్యటించారు. దీనిలో భాగంగా ఎండ వేడిమికి సమీపంలో ఉన్న దళిత మహిళ ఇంటి అరుగుపై సేద తీరారు. ఇంట్లో అంబలి ఉంటే ఇవ్వాలని ఆమెను కోరారు. దీంతో వెంటనే ఆ మహిళ తన ఇంట్లో ఉన్న అంబలి గ్లాస్ ఇవ్వగా మంత్రి ఆరగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంబలి తాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మిలెట్స్ వ్యవసాయం, ఉత్పత్తి, మార్కెటింగ్‌కి అధిక ప్రోత్సాహమిస్తున్నట్లు తెలియజేశారు. ఒకప్పుడు పేదల ఆహారమైనటువంటి అంబలి, నేడు అందరి ఆహారంగా మారిందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా అంబలి ప్రాముఖ్యం పొందిందన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్



నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్లోసైక్లింగ్ పోటీలలో విద్యార్థినులు



స్లోసైక్లింగ్ ఈవెంట్‌లో విద్యార్థినులు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న జిల్లా యువజన కేంద్ర అధికారి అక్షయ్ నిప్పాణి

పర్లాకిమిడి: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గజపతి స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ 2024–25ను ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి అక్షయ్ భాస్కర్ నిపాణి ప్రారంభించారు. ఈ జిల్లా స్థాయి క్రీడాపోటీలకు జిల్లాలోని రాయఘడ బ్లాక్ పరశురాం గురుకుల ఉన్నత సెకండరీ పాఠశాల, కాశీనగర్ బ్లాక్ శ్రీరాం డిగ్రీకళాశాల, మోహనా, పర్లాకిమిడి ఉన్నత పాఠశాలల నుంచి 50మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కబడ్డీ, బ్యాడ్మింటన్, స్లో సైక్లింగ్ పోటీల్లో గర్ల్స్ పాల్గొనగా, ఫుట్‌బాల్, రన్నింగ్ రేస్ 100 మీటర్ల బాయ్స్ పాల్గొన్నారు. రన్నింగ్ రేస్‌లో మిథోకుమార్ ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతి సునీల్ గెలుచుకున్నారు. అలాగే మహిళల కబడ్డీ విభాగంలో పరశురాం డిగ్రీకళాశాల విద్యార్థినులు కప్పును కైవసం చేసుకున్నట్టు పీఈటీ అల్లిబిల్లి రామారావు తెలిపారు. ఈ స్పోర్ట్స్ ఈవెంటుకు సెంచూరియన్ వర్సిటీ స్పోర్ట్స్ అధికారి ఎ.హారిచందన్, నెహ్రూ యవకేంద్రం సిబ్బంది ఎ.మహేశ్వరరావు, వి.భవానీ ప్రసాద్ తదితరులు సహకరించారు.

నీలావడి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్, జెడ్పీ

• నీలావడి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్



నీలావడి అమ్మవారి గుడి వద్ద కొరాపుట్ జెడ్పీ చైర్‌పర్సన్ సస్మితా మెలక



సస్మితా మెలకను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొరాపుట్: నీలావడిలో అగ్ని గంగమ్మ అమ్మవారిని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలకలు వేర్వేరుగా దర్శించుకున్నారు. మంగళవారం కొరాపుట్ జిల్లా బందుగాం సమితి అలమండ సమీపంలో ఉన్న నీలావడిలోని అగ్ని గంగమ్మ ఉత్సవాలకు కలెక్టర్ హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి ఘటాన్ని కలెక్టర్ తలపై ఉంచారు. కలెక్టర్ మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపు జెడ్పీ చైర్మన్ సస్మితా మెలక అమ్మవారిని దర్శించుకున్నారు. దేవలయ కమిటీ సభ్యులు మెమెంటోతో ఆమె ని సత్కరించారు.





అమ్మవారి ఘటం మోస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్ (ఇన్‌సెట్లో)
అమ్మవారిని దర్శిస్తున్న కొరాపుట్ జిల్లా కలెక్టర్ కీర్తి వాసన్

కదంతొక్కిన అంగన్‌వాడీలు

• సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
• భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



వినతి పత్రాన్ని అందుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్ల సంఘం కార్యదర్శి పుష్పాంజలి పండా



గజపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

పర్లాకిమిడి: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో గజపతి జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. తొలుత భారతీయ మజ్దూర్ సంఘ్, ఆల్ ఇండియా అంగన్‌వాడీ లేడీస్ వర్కర్స్ సంఘం కార్యకర్తలు, హెల్పర్లు రాజవీధి నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ జరిపారు. అంగన్‌వాడీ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులవలే గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ, రిటైర్‌మెంట్ తరువాత కనీస పింఛన్ రూ.5 వేలు మంజూరు చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు సంఘం అధ్యక్షురాలు కున్నీ జెన్నా అన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు సుజిత్ ప్రధాన్, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం కార్యదర్శి పుష్పాంజలి పండా, అధ్యక్షురాలు కున్ని జెన్నాలు డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండాను కలుసుకుని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యదర్శి అంజలీ నాయక్, జిల్లాలోని ఏడు సమితి కేంద్రాల నుంచి హెల్పర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

టికిరిలో చోరీ

• రూ.1.70 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణ



సీసీ పుటేజీను పరిశీలిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలోని దొరావీధిలో నివసిస్తున్న సుశాంత్ నాగ్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటి ముందు గల సీసీ కెమెరా వైర్లను తొలగించిన దుండగులు ఇంటి వెనుక గల తలుపులను విరగ్గొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువాలో ఉంచిన రూ. 1.70 లక్షల నగదుతోపాటు నాలుగు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. శనివారం నాడు సుశాంత్ తన కుటుంబీకులతో కలిసి నీలావడి యాత్రకు వెళ్లాడు. అక్కడే ఉన్న తన బంధువుల ఇంట్లో ఒకరోజు ఉన్నారు. ఇంటి తలుపులు వేసి ఉండడంతోపాటు లోపల ఎవరూ లేరని నిర్ధారించుకున్న దుండగులు ఇదే అదనుగా భావించి చోరీకి పాల్పడ్డారు. అయితే వేరే గదిలోని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

ఐఏఎస్ అధికారుల బదిలీ

భువనేశ్వర్: రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వులు ప్రకారం సాంకేతిక విద్య, శిక్షణ, ఒడిశా ఫిల్మ్ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సమర్థ వర్మకు లఘు ఖనిజాల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. కె.సుదర్శన్ చక్రవర్తి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్, శుభమ్ సక్సేనా వ్యవసాయం, ఆహార ఉత్పాదన విభాగం డైరెక్టర్‌గా నియమితులు అయ్యారు.

• బ్లూ డ్రాగన్

బ్లూ డ్రాగన్ అందమైనదే కానీ విషపూరితం. ప్రముఖ సాగర తీరాల్లో దీని సంచారం ఇటీవల కనిపిస్తోంది. రాష్ట్రంలో అస్తరంగ్, కోణార్క్, పూరీ సాగర తీరాల్లో కనిపిస్తూ ఉంటుంది.

– భువనేశ్వర్



• బాబోయ్.. పులి



అడవిలో నుంచి హఠాత్తుగా జనావాసాల వైపు అడుగులు వేసిన పెద్ద పులిని చూసిన గ్రామస్తులు పరుగులు పెట్టారు. ఈ ప్రాణాంతక పరిస్థితి ముండేశ్వర్ అటవీ ప్రాంతం పరిసర ప్రాంతాల్లో తలెత్తింది. గ్రామంలో పెద్ద పులి సంచారంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. బౌద్ జిల్లా బారింగి గ్రామంలో చెరువు తవ్వకం పనులు చేస్తుండగా పక్కనే ఉన్న అడవి ప్రాంతం నుంచి పులి బయటకు రావడంతో గ్రామస్తుల దృష్టికి వచ్చింది. పులిని చూసిన కార్మికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గ్రామంలోకి పరుగులు తీశారు.

– భువనేశ్వర్

క్లుప్తంగా

ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఎచ్చెర్లలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ యువత కోసం సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో 13 రోజుల ఉచిత శిక్షణను ఈ నెల 28 నుంచి ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తామని, పూర్తి వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యుత్ కార్మిక సంఘాల ప్రతినిధులు

అరసవల్లి: పెద్దపాడు సమీపంలో ఈ నెల 12న విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావుపై దాడికి పాల్పడిన స్థానిక టీడీపీ నేత కలగ శ్రీనివాసరావుపై ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని.. ఇంకో మూడు రోజుల్లో దీనిపై తేల్చకపోతే భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతామని విద్యుత్ కార్మిక సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తిని మంగళవారం పలువురు కార్మిక ఉద్యోగ సంఘ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. దాడి చేయడమే కాకుండా మిగిలిన వారిపై పరుష పదజాలంతో దూషించినా పోలీసులు ఇంతవరకు చర్యలు చేపట్టలేదన్నారు. ఇలాగైతే విధులు నిర్వర్తించడం కష్టమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఎస్ఈ తదితర ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్ఈని కలిసిన వారిలో ఎం.ప్రభాకరరావు, టి.వి.సుబ్రహ్మణ్యం (1104), కె.వైకుంఠం (తెలుగునాడు), సీహెచ్ పాపారావు (327), బి.గురునాథరావు (బహుజన), విద్యుత్ కార్మిక యూనియన్ నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఖాతాల నిర్వహణపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల ఖాతాల నిర్వహణ ఆన్‌లైన్ చేయాలని వెలుగు సంస్థ సంస్థాగత నిర్మాణం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాల ఏసీ, ఎల్ఎస్, ఏపీఎం, సీసీ, వీవోఏలకు లోకోస్ సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ ఖాతాల నిర్వహణపై మంగళవారం శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ మార్గదర్శకాలను అనుగుణంగా స్వయం సహాయ సంఘాలు విజయవంతంగా ముందుకు సాగాలన్నారు. గ్రామైక్య, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఖాతాల నిర్వహణ పక్కాగా ఉండాలని చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలత, అధికారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

టెక్కలి రూరల్/కాశీబుగ్గ: కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. సుమారు 55 ఏళ్ల వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా మారిందని తెలిపారు. సమీప ప్రాంతాలలో ఎవరైనా వృద్ధుడు కనిపించకపోయినా, మృతిపై వివరాలు తెలిసినా 9440627567 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆస్తి తగాదాలో మహిళపై దాడి

సంతబొమ్మాళి: మండలంలోని మలగాం పంచాయతీ దేపల్లివానిపేటలో ఆస్తి విషయమై మహిళపై దాడి జరిగింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఎరుపల్లి కామమ్మ ఆధీనంలో ఉన్న ఆస్తిని ఆమె మరణానంతరం గ్రామానికి చెందిన ఎరుపల్లి లక్ష్మణరావు, అతని బంధువులు కబ్జా చేయడానికి మంగళవారం ప్రయత్నించారు. గొయ్యిలు తీసి సిమెంటు స్తంభాలను పాతి ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించగా కామమ్మ కుమార్తెలు దేపల్లి రాజమ్మ, నందుపల్లి సీతమ్మ అడ్డుకున్నారు. తమ స్థలంలో కంచె వేయడానికి మీరెవరని, ఏమైనా పత్రాలు ఉంటే గ్రామపెద్దలకు చూపించాలని కోరారు. పెళ్లయి అత్తారింటికి వెళ్లిపోయినా మీరు ఇక్కడికి వచ్చి అడగడం ఏంటంటూ ఎరుపల్లి లక్ష్మణరావు, పార్వతి, తాతయ్య లక్ష్మమ్మ, అప్పమ్మ, తదితరులు దాడి చేశారు. ఈ క్రమంలో రాజమ్మ స్తంభాలపై పడటంతో తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే బాధితురాలిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి పోలీసులు తెలిపారు.

వేతనాలు పెంచాలి



కలెక్టర్ కర్యాలాయం వద్దకు చేరుకున్న అంగన్వాడీ వర్కర్స్

మల్కన్‌గిరి: వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కోరారు. ఈ మేరకు మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో అఖిల ఒడిశా అంగన్‌వాడీ లేడీస్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ చేశారు. ముందుగా స్థానిక బస్టాండ్ నుంచి మూడు వేల మంది అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు అందజేశారు. కార్యకర్తకు రూ. 18 వేలు, సహాయకులకు రూ. 9 వేలు జీతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.



బస్సుస్టేండ్ వద్ద నుండి ర్యాలీ ప్రారంభించిన అంగన్వాడీ సిబ్బంది

మహిళల రాస్తారోకో

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ అడవ పోలీసులు హాడుపదర్ గ్రామంలో సోమవారం రాత్రి 11 మందిని అరెస్టు చేసిన నేపథ్యంలో గ్రామస్తులు, మహిళలు స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ జాతీయ రహదారి 326 – ఏ వద్ద రాస్తారోకో చేశారు. అమాయకులను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు ముగ్గుర్ని విడిచిపెట్టడంతో ఆందోళన విరమించారు. ఎస్.డి.పి.ఎస్.చట్టం కింద కేసు నమోదుచేసినట్టు ఎస్.డి.పి.ఓ. అమితాబ్ పండా తెలిపారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

సెంచూరియన్ వర్సిటీలో
మంజర్ 3.ఓ ప్రారంభం



సెంచూరియన్ వర్సిటీ మంజర్ 3.ఓలో పాల్గొన్న విద్యార్థులు, ఆచార్యులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో మంజర్ 3.ఓను రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో ఓపెన్ ఆడిటోరియంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మ్యానేజ్‌మెంట్ అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రజ్ఞాపాణి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, మంజర్ స్టూడెంట్స్ కోఆర్డినేటరు డాక్టర్ సుశాంత కుమార్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో బెంగళూరు నుంచి నిప్పాన్ మ్యానేజ్‌మెంట్ జోనల్ అధికారి దేవ మహాపాత్రో పాల్గొని విద్యార్థులకు మార్కెటింగ్ స్కిల్స్, ఇకో సిస్టంపై వివరించారు.

తండ్రిని కోల్పోయి.. తల్లి ఆస్పత్రి పాలై..

- దిక్కుతోచని స్థితిలో ముగ్గురు బాలికలు
- సాయం చేయాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరళ

కాశీబుగ్గ : ఆ ముగ్గురు చిన్నారులు రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయారు. అదే ప్రమాదంలో తల్లి తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైంది. ఇప్పుడు ఆ చిన్నారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమకు దాతలు సాయం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ ప్రాంతంలో బుట్ట గంగాధర్, సరళ దంపతులు ముగ్గురు కుమార్తెలతో నివాసం ఉండేవారు. గంగాధర్ దివ్యాంగుడు. నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. చిన్న ఇల్లు తప్ప వేరే ఆస్తులు లేవు. పదిరోజుల క్రితం ఒడిశా రాష్ట్రం గండహతి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు లోయలో పడిపోయారు. గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య సరళకు కాలు, నడుము విరిగిపోయాయి. ఆస్పత్రిలో దిక్కుతోచని స్థితిలో ఉంది. వారి సంతానమైన ముగ్గురు బాలికలు అనాథలుగా మిగిలిపోయారు. దాతలు స్పందించి చిన్నారులకు చేదోడుగా నిలబడాలని అమ్మమ్మ జి.గౌరి(8374708027) వేడుకుంటోంది.



దిక్కుతోచని స్థితిలో ముగ్గురు పిల్లలు

తుఫాన్‌లా వచ్చాడు..
పోలీసులకు దొరికిపోయాడు

- 21 కేజీల గంజాయితో తుఫాన్ అనే వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా రాష్ట్రం డెంకానాల్ జిల్లా నువా గ్రామానికి చెందిన తపన్ సమాల్ అలియాస్ తుఫాన్ అనే యువకుడు గంజాయితో పట్టుబడినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. తుఫాన్‌కు గుంటూరులో ఓ దాబా వద్ద తమిళనాడుకి చెందిన ముతురాజ్, సుందర్‌రుధిర సమితో 'గంజాయి' పరిచయం ఏర్పడింది. రూ.15 వేలకు కేజీ గంజాయి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో తన స్వగ్రామం సమీపంలోని గలపాడు నుంచి కేజీ రూ.7500 చొప్పున 21.040 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. ఒడిశా నుంచి బస్సులో బయలుదేరి ఇచ్ఛాపురం మంగళవారం చేరుకున్నాడు. అనంతరం రైలు కోసం వెళ్తుండగా రత్తకన్న ఎల్‌సీ రైల్వే గేట్ వద్ద రూరల్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

శ్రీకాకుళంలో ఓ యువకుడు..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని 80 ఫీట్ రోడ్డు సమీప ఏపీహెచ్‌బీ కాలనీ గ్రౌండ్‌లో రెండు కిలోల గంజాయితో ఓ యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. తోటపాలెంకు చెందిన లొట్టి సురేష్ ఏపీహెచ్‌బీ కాలనీ గ్రౌండ్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో పాటు వెళ్లి సురేష్‌ను అదుపులో తీసుకోగా అతని వద్ద రెండు కిలోల గంజాయి ప్యాకెట్ లభించింది. సీఐ పైడపునాయుడు ఈ ఘటనపై ఆరా తీశారు. అనంతరం సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

బైక్ చోరులు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలోని 80 ఫీట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఇద్దరు యువకులు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మొండేటివీధిలో నివాసముంటున్న దమర్సింగి అఖిల్‌సాయి, ఎచ్చెర్ల మండలం ఎ.జి.పేటకు చెందిన భానుప్రసాద్ అలియాస్ పిలకడు అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే ఒకటో పట్టణ ఎస్ఐకు సమాచారం అందించగా సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని విచారించగా ఐదు ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. తుప్పల్లో దాచిన బైక్‌లను తీసి చూపించారు. శ్రీకాకుళం రూరల్ పీఎస్‌లో రెండు, ఒకటో పట్టణ పీఎస్, రెండో పట్టణ పీఎస్, ఎచ్చెర్ల పీఎస్‌ల్లో ఒక్కోటి చొప్పున ఈ చోరీలు చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రంలో పాలనాధికారుల కొరత: ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర సర్వీసులలో అనేక కీలకమైన బ్యూరోక్రాటిక్ పోస్టులు భర్తీ కాకుండా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర పాలన కార్యకలాపాల సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. శాసన సభలో కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని ఈ మేరకు వివరాల్ని ప్రవేశ పెట్టారు. రాష్ట్రంలో పరిపాలనాధికారుల పోస్టుల ఖాళీల స్థితిగతులపై ఎమ్మెల్యే టొంకొధొరొ త్రిపాఠి లేవనెత్తిన ప్రశ్నకు బదులుగా ముఖ్యమంత్రి మోహన్ మాఝి అధికారిక సమాధారం అందజేశారు.

'రాష్ట్రంలో ప్రస్తుతం 67 ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), 69 ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటితో ఇతర కీలకమైన ఉన్నత పాలనాధికారుల పోస్టులు కూడా ఖాళీగా కొనసాగుతున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 69 ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పోస్టులు, 253 ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) మరియు ఒడిశా పోలీస్ సర్వీస్ (ఓపీఎస్) పోస్టులు, 274 ఒడిశా ఫైనాన్స్ సర్వీస్ (ఓఎఫ్ఎస్) పోస్టులు, 611 ఒడిశా ఫారెస్ట్ సర్వీస్ (ఓఎఫ్ఎస్), 263 ఒడిశా రెవెన్యూ సర్వీస్ (ఓఆర్ఎస్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.' అని తెలిపారు. భారీ సంఖ్యలో ఉన్నతాధికారుల పదవులు ఖాళీగా ఉండటంతో క్షేత్ర స్థాయి పనుల అనుసంధానం తగ్గుతోందని తెలిపారు.

జయపురం అర్బన్ సహకార బ్యాంక్ 81వ సర్వసభ్య సమావేశం



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి విజయ రావు

జయపురం: జయపురం అర్బన్ సహకార బ్యాంక్ 81వ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం బ్యాంక్ సభాగృహంలో జరిగింది. బ్యాంక్ పరిచాలన కమిటీ అధ్యక్షుడు సుకాంత త్రిపాఠీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత 80 వ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాల అమలుపై కార్యదర్శి విజయ రావు సభికులకు వివరించారు.అలాగనే 2023–24 ఆర్థిక సంవత్సరం బ్యాంక్ లాభ నష్టాల బేలన్స్ షీట్‌ను కార్యదర్శి సభ ముందుంచగా, పరిచాలన కమిటీ ఆమోదించింది. అలాగే 2025–26 వార్షిక బడ్జెట్‌ను సభ ఆమోదించింది. అలాగనే 2025–26 వార్షిక సంవత్సర జయపురం అర్బన్ బ్యాంక్ యాక్షన్ ప్లాన్‌ను సభ ఆమోదించింది.

సీడీఎంఓ తో చర్చలు సఫలం



నబరంగ్‌పూర్ సీడీఎంఓతో చర్చలు జరుపుతున్న ప్రతిపక్ష నాయకులు మున్నా త్రిపాఠి, సరోజ్ పాత్రో, ప్రమోద్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ముఖ్య వైద్యాధికారి (సీడీఎంఓ) తో చర్చలు సఫలం కావడంతో ప్రతిపక్షాలు బంద్‌ని వాయిదా వేశాయి. మంగళ వారం రాజకీయ పక్షాలతో సీడీఎంఓ సంతోష్ కుమార్ పండా తన కార్యాలయంలో చర్చలు జరిపారు. జిల్లాలో మరో నలుగురు వైద్య నిపుణులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. తొలగించిన వైద్య సిబ్బందిని పునః నియమించడానికి ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉందన్నారు. దాంతో ఈ నెల 20 వ తేదీన జరగాల్సిన నబరంగ్‌పూర్ జిల్లా బంద్ వాయిదా వేస్తున్నట్లు ప్రతి పక్షాలు ప్రకటించాయి. ఈ చర్చలలో కాంగ్రెస్ నాయకుడు మున్నా త్రిపాఠి, బీజేడీ నాయకులు సరోజ్ పాత్రో, ప్రమోద్ రథో,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

నవ కిశోర్ దాస్ హత్యపై
దర్యాప్తు పునఃప్రారంభం



నవ కిశోర్ దాస్, దివంగత మంత్రి



మీడియాతో మాట్లాడుతున్న దివంగత మంత్రి కొడుకు, కూతురు



మీడియాతో మాట్లాడిన న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్



సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన రాష్ట్ర మాజీ మంత్రి నవ కిశోర్ దాస్ హత్య కేసు పునః దర్యాప్తు ప్రారంభమైంది. ఈ చర్యతో మాజీ మంత్రి హత్య కేసు దర్యాప్తు కొత్త మలుపు తిరిగే అవకాశంపై సర్వత్రా చర్చ ఊపందుకుంది. బిజూ జనతా దళ్ అధికారంలో ఉండగా ఈ సంచలనాత్మక హత్య సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనపై అప్పటి ప్రభుత్వం క్రైం శాఖ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ చర్య పట్ల అప్పటి విపక్షం భారతీయ జనతా పార్టీ పెదవి విరిచింది. ఇంతలో బీజేపీ అధికారంలోకి రానే వచ్చింది. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని దివంగత మంత్రి నవ కిశోర్ దాస్ కుటుంబీకులు సీబీఐ దర్యాప్తు కోసం ప్రతిపాదించారు. లిఖితపూర్వకంగా అభ్యర్థిస్తే పరిశీలిస్తామని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. ఆయన ప్రతిపాదన మేరకు హత్యకు గురైన మంత్రి కుటుంబీకులు సీబీఐ దర్యాప్తు కోసం లిఖితపూర్వ అభ్యర్థనకు సన్నద్ధత ప్రదర్శించారు. ఇటీవల దివంగత మంత్రి భార్య ఈ–మెయిల్ ద్వారా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో సంప్రదించారు. తన భర్త హత్య విషయంలో తమకు న్యాయం చేయాలనే అభ్యర్థనతో సంప్రదించాలనే యోచనతో ముందస్తు అనుమతి కోసం ముఖ్యమంత్రికి ఈ–మెయిల్ చేసినట్లు ఆమె ప్రకటించారు.

ఈ అభ్యర్థన మేరకు మాజీ మంత్రి హత్య కేసుని రాష్ట్ర క్రైం శాఖ దర్యాప్తు పునః ప్రారంభిస్తుందని న్యాయ శాఖ మంత్రి ప్రకటించారు. లోగడ ఈ సంస్థ దర్యాప్తు పట్ల పెదవి విరిచిన బీజేపీ ఇలా స్పందించడం పట్ల విపక్ష బిజూ జనతా దళ్ ఎద్దేవా చేస్తోంది. ఈ హత్య సంఘటనపై క్రైం శాఖ దర్యాప్తు పూర్తయింది. ఒక నిందితుడిని అరెస్టు చేయడం జరిగింది. దివంగత మంత్రి కుటుంబీకుల అభ్యర్థన మేరకు సీబీఐ దర్యాప్తు విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గడంలో ఆంతర్యాన్ని విపక్షం బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే గౌతమ్ బుద్ధ దాస్ నిలదీశారు. ఇదో రాజకీయ కుట్ర చర్యగా ఆయన అభివర్ణించారు.

కుటుంబీకుల వాంగ్మూలం నమోదు

మంత్రి హత్య కేసు దర్యాప్తులో భాగంగా రాష్ట్ర క్రైం శాఖ ఝార్సుగుడలో ఆయన కుటుంబ సభ్యుల నుంచి వాంగ్మూలాలను మంగళ వారం నమోదు చేసింది. ఇద్దరు క్రైమ్ బ్రాంచ్ సభ్యుల బృందం పునః దర్యాప్తు చేపట్టింది. దివంగత మంత్రి నవ కిశోర్ దాస్ కుమారుడు విశాల్ దాస్, కుమార్తె దీపాలి దాస్, భార్య మీనతి దాస్ వాంగ్మూలాలను క్రైమ్ శాఖ దర్యాప్తు బృందం నమోదు చేసింది.

సీబీఐ దర్యాప్తు ఆశిస్తున్నాం

తండ్రి హత్య సంఘటనపై సీబీఐ దర్యాప్తు ఆశిస్తున్నట్లు దివంగత మంత్రి నవ కిశోర్ దాస్ కుమార్తె దీపాలి దాస్, కొడుకు విశాల్ దాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రితో ముఖాముఖి చర్చ కోసం నిరీక్షిస్తున్నారు. మంగళవారం 2 మంది సభ్యుల క్రైం శాఖ దర్యాప్తు బృందం వీరిద్దర్ని సుదీర్ఘంగా 7 గంటల సేపు ప్రశ్నించింది. వాంగ్మూలం నమోదు చేసింది. వాంగ్మూలం క్రమంలో తండ్రి హత్య సంఘటనపై ఈ బృందం పారదర్శకంగా దర్యాప్తు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి పూజలు



బాలసదనంలో బోధిస్తున్న సత్యసాయి సభ్యులు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో సత్యసాయి పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా కలిమెల పంచాయతీ పరిధి గిరిజన కాలనీలో బాల వికాస కేంద్రం నూతన శాఖ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సమితి అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ మహాపాత్రో, జిల్లా సేవా సమన్వయకర్త ప్రశాంత్ కుమార్ సాహు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదును.. ఇదే అదును!

- ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను
- కవిటి–రాజపురం రోడ్డుపక్కన స్థలాన్ని జేసీబీతో చదునుచేయించిన వైనం
- స్థలాన్ని పరిరక్షించాలని కోరుతున్న స్థానిక రైతులు



కవిటిలో చదునుచేసిన ప్రభుత్వ భూమి ఇదే

కవిటి : మండల కేంద్రం కవిటిలో ప్రభుత్వ భూమిని కవిటి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వజ్జ రంగారావు భారీ ఖర్చుతో చదును చేయించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. చదును పేరిట స్థలాన్ని ఆక్రమించుకునేందుకే ఇటువంటి పనులు చేస్తున్నారని పరిసర ప్రాంత రైతులు చెబుతున్నారు. కవిటి నుంచి రాజపురం వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన రంగారావుకు కొబ్బరి తోట ఉంది. రోడ్డుకు, తోటకు మధ్య కొంత ప్రభుత్వ స్థలం కూడా ఉంది. ఈ స్థలంలో ఇటీవల ట్రాక్టర్‌తో మట్టి లోడ్లు లేశారు. మట్టి వేయడం జేసీబీతో వేసిన చదును చేయడం ఏకకాలంలో చేపట్టారు. ట్రాక్టర్ వెళ్లడానికి స్థలాన్ని చదును చేయిస్తున్నానని చెబుతున్నా స్థలం అంతటినీ చదును చేయిస్తుండడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ తోటకే వెళ్లేందుకు మార్గాన్ని సిద్ధం చేసుకోవాలంటే అంత ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అంత భారీ మొత్తం ఖర్చు పెట్టి చదును చేయాల్సిన అవసరం ఏముంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అనుమతి లేకుండానే..

ప్రభుత్వ స్థలం చదును చేయించాలంటే అధికారుల ఆమోదం పొందాలి. సుమారు 40 సెంట్ల వరకు అక్కడ స్థలం ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇక్కడే విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేశారు. అప్పట్లో రంగారావు అభ్యంతరం తెలపడంతో ఆ ప్రయత్నాన్ని మార్చుకున్నారు. ఇప్పుడు స్థలం చదును చేయించడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వ అధికారాన్ని, స్థానికంగా ఉన్న ప్రభుత్వ విప్ బి.అశోక్ అండదండలతోనే ఇదంతా జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించాం..

స్థలం చదును విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లాం. తన తోటకు వెళ్లడానికే మాత్రమే స్థలాన్ని చదును చేయిస్తున్నానని, ఆక్రమణకు కాదని రంగారావు చెప్పారు. ఒకవేళ స్తంభాలు వంటివి పాతితే శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– ఎస్.నారాయణ, వీఆర్‌ఓ

రెమ్యునరేషన్ పెంచాలని వినతి

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది పారితోషికం పెంచాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, సహాధ్యక్షులు నెమలిపురి విష్ణుమూర్తి, జాయింట్ సెక్రటరీ కె.కె.రామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షల రెమ్యునరేషన్‌ను రెండు వందల వరకు ఇస్తున్నారని.. పదో తరగతి పరీక్ష విధులకు మాత్రం చాలా తక్కువ మొత్తం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. రవాణా చార్జీలకు కూడా సరిపోని విధంగా ఉన్న రెమ్యూనరేషన్ మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వం కేటాయించిన విధంగా పదో తరగతి పరీక్షలకు బడ్జెట్ కేటాయింపులు జరగాలన్నారు. దూరంతో సంబంధం లేకుండా ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టమెంట్ ఆఫీసర్లు, కారు కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, క్లర్క్, ఇతర సిబ్బంది రెమ్యునరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

జీడి, మామిడి తోటలు దగ్ధం



మామిడి, జీడిమామిడి తోటలు కాలిపోతున్న దృశ్యం

వేపాడ: మండలకేంద్రం వేపాడ రెవెన్యూ పరిధి రాయుడుపేట రహదారిని ఆనుకుని ఉన్న జీడిమామిడి, మామిడి తోటలు మంగళ వారం సాయంత్రం దగ్ధమయ్యాయి. దీనికి సంబంధించి ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదం సమాచారం తెలుసు కున్న ఎస్.కోట అగ్నిమాపకసిబ్బంది సంఘ టనస్థలానికి చేరుకుని మంటలను అదుపుచే శారు. గ్రామానికి చెందిన గుత్తి గుణవతి, సత్య వతి, మోహన్, శ్రీను, సింహచలం తదితరు లకు సంబంధించిన జీడిమామిడి, మామిడి తోటలు సుమారు నాలుగున్నర ఎకరాలు కాలిపోయాయి. కార్యక్రమంలో ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ ఎస్.కె.మ దీనా, ఆర్‌వెంకటరావు, వై.నర్సింగరావులు పాల్గొన్నారు.

బాంబ్ బ్లాస్టింగ్‌లో వ్యక్తి మృతి



బోర కొత్తయ్య (ఫైల్)

భోగాపురం: ఎయిర్ పోర్టు నిర్మాణంలో భాగంగా జరిపిన బాంబ్ బ్లాస్టింగ్‌లో ఒక వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందిదాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన బోర కొత్తయ్య(35) విమానాశ్రయం పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. ఎయిర్‌పోర్టు సిబ్బంది కవులవాడ సమీపంలో రోడ్డు నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించేందుకు బాంబులను ఏర్పాటు చేసి బ్లాస్టింగ్ చేశారు. ఈ బ్లాస్టింగ్‌లో కొత్తయ్య ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఎయిర్‌పోర్టు సిబ్బంది గాయపడిన కొత్తయ్యను తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య ఎర్రమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన గెంబలి కాంతారావు

పార్వతీపురంటౌన్: పట్టణంలో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీనిపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దంగిడి వీధికి చెందిన గెంబలి కాంతారావు పనుల నిమిత్తం పార్వతీపురం పట్టణం పాత బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా పార్వతీపురం నుంచి పాలకొండ రోడ్డుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కాంతారావుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

18 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద అక్రమంగా 18 మద్యం బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. మద్యం షాపు నుంచి అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్నాడని సమాచారం రావడంతో నిఘా పెట్టి ఆ వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

డ్వామాలో వింత డ్రామా..!

- అక్రమార్కులకు అండగా అధికారులు
- అవినీతికి పాల్పడిన వారిపై చర్యలకు వెనుకడుగు
- గుర్ల, గంట్యాడ ఏపీఓలపై అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు శూన్యం
- ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్లు గుర్ల ఏపీఓపై ఆరోపణలు
- లక్షలాది రుపాయల అక్రమాలకు పాల్పడినట్లు గంట్యాడ ఏపీఓపై ఆరోపణలు



జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: ఉపాధిహామీ పథకంలో పనిచేసే మేట్లకు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇప్పిస్తానని గుర్ల ఉపాధి హామీ పథకం ఏపీఓపై ఆరోపణలు వచ్చాయి. కలెక్టరేట్‌లోలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గార రామలక్ష్మి అనే మహిళ ఏపీఓపై ఇప్పటికే రెండుసార్లు ఫిర్యాదు చేసింది. అయినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గంట్యాడ ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్షలాది రుపాయల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అతనిపై ఉపాధి పథకం రాష్ట్రస్థాయి అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని నరవ, లక్కిడాం, పెణసాం, మధుపాడ తదితర గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారుల నుంచి లక్షలాది రుపాయలు వసూలు చేసినట్లు ఏపీఓపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఆ ఏపీఓపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన సిబ్బంది అధికారులకు కొంత మొత్తం ముట్టజెప్పి మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది సైతం అక్రమాలకు పాల్పడడానికి సాహసిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో స్థాయిని బట్టి ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డిప్యూటీ సీఎం మాటలు ప్రకటనలకే పరిమితమా..?

నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నీటి యాజమాన్య శాఖలో అవినీతికి తావు ఉండదు. ఎవరైనా అక్రమాలకు, అవినీతికి పాల్పడితే వారి తాట తీస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలు సందర్భాల్లో వాఖ్యనించారు. డ్వామా అధికారులు, సిబ్బందిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఏమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొన్ని అక్రమాలే బయటకు

నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో జిల్లాలో పలు చోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలపై కొన్ని చోట్ల ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ధైర్యం చేసి ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది అక్రమాల గురించి ప్రస్తావించేందుకు డ్వామా పీడీ ఎస్.శారదాదేవి వద్ద సాక్షి ప్రస్తావించడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

బంకురువలసలో మాంగనీస్ అక్రమ తరలింపు..?



కుప్పలుగా ఉన్న మాంగనీసు ఓర్

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ పంచాయతీ శివారు గ్రామం బంకురు వలస వద్ద అక్రమంగా మాంగనీస్ తవ్వకాలు చేస్తూ తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఎటువంటి లైసెన్స్ లేకుండా తవ్వకాలు చేపడుతూ గ్రేడింగ్ చేసి తరలిస్తున్నారంటూ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఆర్‌డీఓ రామ్మోహనరావుకు కొంతమంది వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ జరపాలని తాహసీల్దార్ ఎం శ్రీనును ఆర్‌డీఓ ఆర్‌ఐ రామకుమార్ ఆదేశించగా తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది క్వారీ ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. గతంలో ఇక్కడ మాంగనీసు ఓర్ తవ్వకాలకు అనుమతులున్నా తదనంతరం అక్కడి తవ్వకాలపై ప్రభుత్వం నిషేధం విధించడంతో తవ్వకాలు నిలిపివేసినట్లు యజమాని ఫారూఖ్ తెలియజేశారు. గతంలో తవ్వి ఉంచిన మాంగనీసు కుప్పల్లో గ్రేడింగ్ చేసి మాంగనీసును తరలించేందుకు తమకు అనుమతులున్నాయని, తవ్వకాలు చేపట్టడం లేదని వివరించారు. అలాగే ప్రతి ఏడాది రూ.10వేలు ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లించి గ్రేడింగ్ చేసుకుంటున్నట్లు చెప్పడంతో రెవెన్యూ సిబ్బంది నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. మంగళవారం విలేకరులు సంబంధిత ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా మాంగనీసును గ్రేడింగ్ చేస్తున్న దాదాపు 50 మంది కూలీలు అక్కడ పనిచేస్తూ కనిపించారు.

కేవలం గ్రేడింగ్‌కు అనుమతి

మాంగనీసు గ్రేడింగ్ తరలింపుపై తహసీల్దార్ ఎం.శ్రీనును వివరణ కోరగా గతంలో అక్కడ ప్రభుత్వ అనుమతితో మైనింగ్ జరిగిందన్నారు. ప్రస్తుతం తవ్వకాలకు అనుమతి లేదని, కేవలం గ్రేడింగ్ చేసి తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులున్నాయని తెలియజేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌ల నేతృత్వంలో సహస్ర కుంకుమార్చన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఘనంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్, దూసిశివప్రసాద్, తాతా రాజేష్‌లు శాస్త్రోక్తంగా యాగప్రక్రియను నిర్వహించారు. యాగం అనంతరం భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోడల్ యూత్ పార్లమెంట్



మోడల్ యూత్ పార్లమెంట్ నిర్వహణలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో విద్యార్థులు మంగళవారం నిర్వహించిన 'యువ మంథన్ మోడల్ యూత్ పార్లమెంట్' ప్రదర్శన ఆకట్టుకుంది. 'వికసిత్ భారత్ : కెరియర్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎంప్లాయ్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఈ ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులే ఎంపీలు, స్పీకర్, కార్యదర్శి వంటి భూమికలను పోషించి చర్చలను ఉత్సాహంగా, ప్రతిభావంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, విమర్శనాత్మక ఆలోచనను ప్రేరేపించడం, పరిపాలనా వ్యవస్థపై అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ ప్రదర్శన సదస్సు నిర్వహించామని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, అవార్డులను రిజిస్ట్రార్ అందజేశారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్ చంద్రబాబు, మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, డాక్టర్ కుసుమ్, మాస్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ కేవీలక్ష్మీపతి రాజు, డాక్టర్ ప్రేమాఛటర్జీ, డాక్టర్ నగేష్, డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, డాక్టర్ దెబంజనా నాగ్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

850కిలోల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో అధికారులు

బలిజిపేట: మండలంలోని గలావల్లిలో 850కిలోల రేషన్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రామారావు, బలిజిపేట సీఎస్‌డీటీ రమేష్‌బాబులు మంగళవారం పట్టుకున్నారు. వారికి అందిన సమాచారం ప్రకారం గలావల్లి గ్రామానికి చెందిన ఎం.రామారావు అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసి ఇంటి వద్ద ఉంచాడు. దీంతో అధికారులు దాడిచేసి రామారావు ఇంటి వద్ద ఉన్న 850కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వ్యాపారి రామారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి జంక్షన్ వద్ద బొలెరో వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గణేష్ మాట్లాడుతూ వాహన తనిఖీలు చేపడుతుండగా ఎటువంటి అనుమతులు లేకుండా వాహనంలో తరలిస్తున్న 60 భస్తాలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

కబడ్డీలో కాంస్యం



విద్యార్థులకు ట్రోఫీ ఇస్తున్న డా.వరలక్ష్మి

శృంగవరపుకోట: సీబీఎస్ఈ స్టేట్‌జోన్ కబడ్డీ పోటీల్లో స్థానిక డా.వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవంలో పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.వరలక్ష్మి కబడ్డీలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాబోధనలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థను రూపొందించడంతో పాటు విద్యార్థులకు క్రీడల్లోనూ తర్ఫీదు ఇచ్చి తయారు చేయడంతో పాఠశాల అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు.

జూడో విజేతలకు జేసీ అభినందనలు



జూడోపోటీల్లో విజేతలను అభినందిస్తున్న జేసీ

విజయనగరం: జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన నెల్లిమర్ల కేజీబీవీ విద్యార్థినులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తన చాంబర్‌లో మంగళవారం అభినందించారు. ఈ నెల 9న స్థానిక విజ్జి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నెల్లిమర్ల కేజీబీవీకి చెందిన 8 మంది విద్యార్థినులు విజయవాడలో ఈ నెల 15.16 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందారు. విజేతల్లో జిల్లాకు చెందిన వై.అనూష 52 కిలోల విభాగంలో రెండోస్థానం, పి.జ్యోత్స్నరాణి తృతీయస్థానంలో నిలిచారు. బి.భార్గవి 63 కిలోల విభాగంలో రెండో స్థానంలో నిలవగా 70 కిలోల విభాగంలో పి.సత్య కూడా ద్వితీయస్థానంలో నిలిచింది. అదేవిధంగా వై.అనూష జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా వారిని జేసీ సేతుమాధవన్ అభినందించి, మరిన్ని విజయాలను సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, జీసీడీఓ మాలతి, నెల్లిమర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.ఉమ, పీడీ ఎస్.రమ తదిరులు పాల్గొన్నారు.

సంకల్ప మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- 546 మందికి లభించిన ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోటలోని మహారాజా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ స్టడీస్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సంకల్ప మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా వివిధ విద్యార్హతలుగల 1,542 మంది అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకాగా వివిధ స్థాయిల్లో నిర్వహించిన పరీక్షలలో ప్రతిభ చూపిన 546 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. మరో 72 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ మేనేజర్ జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. దాదాపు 26 ప్రముఖ బహుళజాతి కంపెనీలు ఉద్యోగులను ఎంపిక చేశాయని, ఎంపికైన వారికి నెలకు రూ.13,000 నుంచి రూ.60,000 వరకు జీతాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎ.అరుణ్, కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎస్‌రాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి టి.భాస్కర్, ఎంప్లాయిమెంట్ యంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్ సీడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శక్తి మొబైల్ యాప్‌పై అవగాహన



'శక్తి' యాప్‌పై అవగాహన కల్పిస్తున్న 'శక్తి' బృందాలు

- కళాశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో కార్యక్రమం

విజయనగరం క్రైమ్: మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా రూపొందించిన శక్తి (ఎస్‌ఓఎస్) మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ, యువత తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం పిలుపునిచ్చారు. మహిళల మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఒక కుటుంబసభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో : శక్తి యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్‌ను ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకుని రక్షణగా నిలుస్తారని చెప్పారు. రాత్రి సమయాల్లో మహిళలు నైట్ షెల్టర్లలో వేచి ఉండేందుకు దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్ల వివరాలు, సమీపంలోని పోలీస్ స్టేషన్ల ఫోన్ నంబర్లు, హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మొబైల్ యాప్ పై 'శక్తి' బృందాలు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని బస్టాండ్‌లు, ఆర్టీసీ కాంప్లెక్సులు, రైల్వేస్టేషన్లు, ముఖ్యకూడళ్ళు, కళాశాలలు సందర్శించి, మహిళలు, విద్యార్థినులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయని చెప్పారు.

ఆక్రమణలపై రెవెన్యూ కొరడా



బొండపల్లిలోని రాముల చెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు



కొండశంభాంలో గెడ్డవాగు ఆక్రమణలో ఉన్న ఆవుల షెడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ అధికారులు

- బొండపల్లి, కొండశంభాం ప్రాంతాల్లో అధికారుల పరిశీలన
- ఆక్రమణలు జరిగినట్లు గుర్తింపు
- సర్వే చేసి తొలగించేందుకు చర్యలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని బొండపల్లి, కొండశంభాం గ్రామాల్లో జరిగిన ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బొండపల్లి పంచాయతీలో గల రాముల చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులు చెరువును ఆక్రమించారని, చెరువులో నుంచి రహదారిని కూడా నిర్మించారని కొన్ని రోజుల క్రితం గరివిడి తహసీల్దార్ కార్యాలయంలో చెరువు ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఆర్‌ఐ అచ్యుతరావుతో పాటు సర్వేయర్,స్థానిక వీఆర్‌ఓలు చెరువులో ఉన్న ఆక్రమణకు గురైన స్థలాన్ని మంగళవారం గుర్తించి ఆక్రమణలను తొలగించారు. చెరువు హద్దు ఎంత వరకు ఉందో చూపించి సరిచేయించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు చెరువులో మరోవైపు కూడా ఆక్రమణలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాలని కోరగా రాముల చెరువు మొత్తం విస్తీర్ణాన్ని కొలతలు వేసి నివేదిక సమర్పించాలని స్థానిక వీఆర్‌ఓ, సర్వేయర్‌ను తహసీల్దార్ ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు లెటర్ రాసి ఆక్రమణలో ఉన్న చెరువుగర్భాన్ని ఉపాధి హామీ పనుల ద్వారా చెరువు పరిధిలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గెడ్డవాగులో పశువుల షెడ్డు నిర్మాణం

అదేవిధంగా కొండశంభాం పరిధిలో గల బొడ్లపేట గ్రామంలో ప్రభుత్వ గెడ్డవాగును స్థానికులు ఆక్రమించుకున్నారని తెలిసిన సమాచారం మేరకు గెడ్డవాగు ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. గెడ్డవాగును మట్టితో కప్పి ఆవుల షెడ్డు నిర్మించారు. ప్రభుత్వ గెడ్డవాగు ఎంత మేరలో ఉందో సర్వే చేయించి గెడ్డవాగును ఆక్రమించిన వారికి నోటీసులు అందించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

పెసర, మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో పెసర, మినుము కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరావు తెలిపారు. జిల్లాలోని జామి మండలం విజినిగిరి రైతు సేవా కేంద్రం, గంట్యాడ మండలంలోని గంట్యాడ ఆర్‌ఎస్‌కే, బొబ్బిలి, గజపతినగరం, సంతకవిటి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలను అనుసరించి పెసలు, మినుములు పూర్తిగా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలన్నారు. పెసలు క్వింటాకు రూ. 8,682, మినుము రూ.7,400 మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు.

ప్రత్యేక తరగతుల కొనసాగింపునకు ఆదేశం

- రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ధర్మకుమార్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ధర్మకుమార్

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగించాలని ఆదర్శ పాఠశాలల రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ధర్మకుమార్ ఆదేశించారు. సతివాడ ఆదర్శ పాఠశాలను మంగళవారం సందర్శించారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణతకు కృషిచేయాలన్నారు. ఆదర్శ పాఠశాలలో ఆరు, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రవేశ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. శతశాతం ప్రవేశాలు జరిగేలా చూసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. వివిధ అంశాలపై ఆరా తీసి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు లీటర్ల సారా పట్టివేత

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడు పేట సమీపంలో దాడులు నిర్వహిస్తుండగా వావిలపాడు గ్రామానికి చెందిన వి.దేముడు ఐదు లీటర్ల సారాతో పట్టుబడినట్లు ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వీఎన్ రాజు తెలిపారు. దీంతో ఆ వ్యక్తి దగ్గర ఉన్న సారా క్యాన్ స్వాధీనం చేసుకునం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైతో పాటు సిబ్బంది సచివాలయం కార్యదర్శి టి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఇది ఏ ఊరు..!



స్పష్టంగా లేని దిబ్బగుడివలస ఊరి బోర్డు

- బోర్డుపై పేరు కానరాదాయె
- స్పష్టంగా ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం

పార్వతీపురం రూరల్: ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి ఊరి ప్రారంభంలో నేమ్ బోర్డు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ తమకేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడం వల్ల వాహనాల్లో ప్రయాణం చేసేవారికి ఆయా గ్రామాల్లో బోర్డులు లేకపోవడం, ఉన్నవి స్పష్టంగా కనిపించకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చించకుండా చేయాల్సిన ఇలాంటి చిన్న పనుల్లో కూడా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపడం పట్ల వాహన చోదకులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి స్పష్టంగా లేని ఊరిపేరుతో ఉన్న బోర్డులను సరిచేయాలని, అస్సలు ఊరు పేరుతో బోర్డులు లేని గ్రామాలకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గందరగోళంగా లచ్చిరాజుపేట ఊరి బోర్డు



సరిగా కనిపించని తాళ్లబురిడి ఊరిబోర్డు



అక్షరాలు లేకుండా ఖాళీగా ఉన్న పుట్టూరు ఊరి బోర్డు



స్పష్టంగా లేని నర్సిపురం ఊరి బోర్డు